క్లుప్తంగా

ఇసుక బుకింగ్ కేంద్రం పరిశీలన

తాడికొండ: తుళ్లూరు తహసీల్దార్ కార్యాలయంలో ఇసుక బుకింగ్‌ను సంయుక్త కలెక్టర్ భార్గవ్ తేజ శుక్రవారం పరిశీలించారు. లారీ డ్రైవర్లతో మాట్లాడి లోడింగ్ పాయింట్‌కు వచ్చినపుడు ఎదుర్కొంటున్న ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. డ్రైవర్లు ప్రధానంగా పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు ప్రాంతాల నుంచి లారీలను తీసుకొని వచ్చామని త్వరితగతిన లోడింగ్ జరిగేలా చూడాలని కోరారు. తొలిరోజు లింగాయపాలెం స్టాక్ పాయింట్‌కు 250 బుకింగ్‌లు చేయగా తాళ్లాయపాలెం స్టాక్ పాయింట్‌లో 233 బుకింగ్‌లు చేశారు. అయితే ఓ స్టాక్ పాయింట్‌లో ఇసుక అయిపోవడంతో మరో స్టాక్ పాయింట్‌లో లోడింగ్ ప్రారంభించగా 186 వాహనాలకు మాత్రమే లోడింగ్ జరిగింది. దారి సక్రమంగా లేక ఓ లారీ ఇరుక్కుపోవడంతో మిగిలిన వాహనాలకు లోడింగ్ నిలిచిపోయింది.

వివాహిత ఆత్మహత్య

తాడికొండ: కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన తుళ్లూరు మండలం వెంకటపాలెం శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల.. గ్రామానికి చెందిన పులి యోహాను, కొల్లిపర మండలం మున్నంగి గ్రామానికి చెందిన వివాహిత శృతి(25)ని పదేళ్ల కిందట వివాహం చేసుకున్నాడు. యోహాను హెచ్‌పీ గ్యాస్ కంపెనీలో పనిచేస్తూ జీవిస్తున్నారు. గత కొంత కాలంగా భార్యాభర్తల మధ్య వివాదాలు ఉన్న నేపథ్యంలో శుక్రవారం ఆత్మహత్య చేసుకొని మృతి చెందింది. అయితే తమ కుమార్తెను అత్త, భర్త వేధించి చంపారని తల్లి కనపాల సుగుణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు.

ప్రపంచ స్థాయి పోటీలకు పవర్ లిఫ్టర్ల ఎంపిక

మంగళగిరి: ఈనెల 28వ తేదీ నుంచి సెప్టెంబర్ 8 వరకు ముల్టా దేశంలో నిర్వహించనున్న వరల్డ్ సబ్ జూనియర్, జూనియల్ సబ్ జూనియర్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు భారతదేశం నుంచి మంగళగిరికి చెందిన ఇద్దరు పవర్ లిఫ్టర్లు ఎంపికయినట్లు కోచ్ సంధాని శుక్రవారం తెలిపారు. పోటీలకు ఎంపికయిన వారిలో కేజీల విభాగంలో ఎం.షానూన్, 57 కేజీల విభాగంలో షేక్ సాదియా ఆల్మాస్‌లు పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

సీఐ నాగుర్ మీరా సాహెబ్ బాధ్యతల స్వీకారం

మేడికొండూరు: సీఐగా షేక్ నాగుర్‌మీరా సాహెబ్ శుక్రవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సీఐ దార్ల జయకుమార్ స్థానంలో ఇక్కడకు వచ్చారు. ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ రహిత మండలంగా చేయడమే తన లక్ష్యం అన్నారు.

హత్యాయత్నం కేసులో జైలు వార్డెన్‌పై కేసు

తాడికొండ: అత్తపై దాడిచేసి, గ్యాస్ లీక్ చేసి హత్యాయత్నం చేసిన కడప జిల్లా జైలు వార్డెన్ మహేష్‌పై కేసు నమోదు చేసినట్లు తుళ్లూరు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు.. హైకోర్టులో సబార్డినేట్‌గా పనిచేస్తున్న సుంకర భువనేశ్వరి, కడప జిల్లా జైలు వార్డెన్ మహేష్‌తో వివాహం జరిగింది. వీరివురు తుళ్లూరు మండలం రాయపూడిలో నివాసం ఉంటున్నారు. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య విభేదాలు తలెత్తడంతో భర్త మహేష్ అత్తపై దాడి చేశాడు. కుమార్తె భువనేశ్వరి ఆఫీస్‌కు వెళ్లగా, ఒంటరిగా ఇంట్లో ఉన్న అత్తపై దాడిచేసి తలపగులగొట్టి, గ్యాస్ లీక్ చేసి హత్యాయత్నానికి పాల్పడగా, గాయాలతో అత్త బయటపడింది. మహేష్ భార్య భువనేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఇనుము దొంగతనం కేసులో నలుగురి అరెస్ట్

తాడికొండ: రాజధాని తుళ్లూరు ప్రాంతంలో ఇనుము దొంగిలించిన కేసులో నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ గంగా వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. నూతనంగా నిర్మిస్తున్న సీఆర్డీయే కార్యాలయం సమీపంలో ఆటోలో రూ.లక్ష విలువ చేసే ఇనుమును తరలిస్తుండగా వచ్చిన సమాచారం మేరకు పోలీసులు దాడిచేసి పట్టుకున్నట్లు చెప్పారు. సామగ్రిని తరలిస్తున్న ఆటోను స్వాధీనం చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ప్రతి ఇంటికి ఆస్తి పన్ను విధిగా ఉండాలి

నెహ్రూ నగర్: నగరంలో ప్రతి ఇంటికి ఆస్తి పన్ను విధిగా ఉండాలని, భవన నిర్మాణం ప్రకారం ఆస్తి పన్ను ఉండాలని, అందుకు ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాత్రి తమ చాంబర్‌లో రెవెన్యూ విభాగ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఐదేళ్ల నుంచి రెవెన్యూ డిమాండ్, ఆస్తి విధింపు, ఆస్తి పన్ను పెంపుదలపై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల వారీగా, వార్డు సచివాలయాల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే సీడీఎంఏ ఆదేశాల మేరకు ప్రతి ఇంటికి కుళాయి ఏర్పాటులో భాగంగా ప్రత్యేక డ్రైవ్ జరుగుతుందని కుళాయి లేని వారు సచివాలయాల్లో కుళాయిల కొరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సమావేశంలో డెప్యూటీ కమిషనర్లు పాల్గొన్నారు.

భయమేస్తోంది..



కోల్‌కతాలో చోటుచేసుకున్న ఘటనతో భయమేస్తోంది. వెలుగులోకి వస్తున్న నిజాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇప్పుడిప్పుడే విద్యార్థినులు ధైర్యంగా ముందుకు వచ్చి పీజీ చదువుకుంటున్నారు. ఇలాంటి ఘటనలతో మళ్లీ ఇళ్లకే పరిమితమయ్యే పరిస్థితులు ఏర్పడతాయి. ప్రభుత్వాలు నిందితుడితో పాటు కారణమైన ప్రతి ఒక్కరిని కఠినంగా శిక్షించాలి. విద్యార్థినులు, వారి తల్లిదండ్రులలో ధైర్యం నింపాలి.

–లిఖిత, వైద్య విద్యార్థిని, మంగళగిరి



కఠిన చట్టాలు తేవాలి

తల్లిదండ్రులకు దూరంగా ఉండి కష్టపడి వైద్య విద్యనభ్యసిస్తున్నాం. ఇలాంటి ఘటనలు మనసికంగా ఎంతో ఆందోళన కలిగిస్తున్నాయి. సమాజానికి వైద్య సేవలందించాలని ఆశయంతో చేరాం. దేశానికి మా వంతు సేవలందించాలని ఆకాంక్ష. కానీ సమాజంలో చోటుచేసుకున్న ఘటనలు ఇబ్బందులకు గురిస్తున్నాయి. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి.

–దేవిరెడ్డి మాధురి, వైద్య విద్యార్థిని



గ్రామ సభలలో కూటమి నాయకుల అత్యుత్సాహం

తాడికొండ: గ్రామాల్లో గ్రామసభలు శుక్రవారం నిర్వహించారు. మండల కేంద్రమైన తాడికొండలో ఎంపీడీఓ సాక్షిగా టీడీపీ మాజీ సర్పంచి, జనసేన, బీజేపీ నాయకులు వేదికలపై ఎక్కి అత్యుత్సాహం ప్రదర్శించారు. బండారుపల్లిలో టీడీపీలోని రెండు వర్గాలు వాగ్వాదానికి దిగారు. ఒక వర్గం ఆక్రమణలపై ప్రశ్నించగా మరో వర్గం తాగునీరు, ఇతర సమస్యలపై అధికారులను నిలదీశారు. పాములపాడులో టీడీపీ ఉప సర్పంచి ప్రొటోకాల్ పాటించలేదని, తనను వేదికపైకి పిలవలేదని, ఆ కార్యదర్శిని బదిలీ చేయాలని ఏకంగా ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. లాం గ్రామంలో మండల ప్రత్యేకాధికారి సాక్షిగా వేదికపై టీడీపీ నాయకులు హల్‌చల్ చేశారు. నిడుముక్కలలో తహసీల్దార్ సాక్షిగా ఓటమి పాలైన సర్పంచి అభ్యర్థి, టీడీపీ గ్రామ అధ్యక్షుడు, వార్డు మెంబర్లు వేదికపై లేకుండా, కార్యదర్శి కూడా వేదికపై లేకుండా హల్‌చల్ చేయడం అధికారులను ఆశ్చర్యానికి గురిచేసింది. సర్పంచి హాజరు కాకుండా తనకు పని ఉందంటూ కనిపించి వెళ్లిపోయారు. పొన్నెకల్లులో టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు గుంటుపల్లి మధుసూదనరావు ఏకంగా మైకు తీసుకొని ఉపన్యాసం ఇచ్చారు. కాగా మండల పరిధిలోని 15 గ్రామ పంచాయతీలలో నిర్వహించిన గ్రామ సభలలో వివిధ సమస్యలపై మొత్తం 262 పనులు కావాలంటూ పలువురు వినతులు వచ్చినట్లు ఎంపీడీఓ అత్తోట దీప్తి తెలిపారు.



బండారుపల్లి గ్రామసభలో టీడీపీ నాయకుల వాగ్వాదం

మూడు గంటలు.. మూడు గ్రామ సభలు

మంగళగిరి: మండలంలోని మూడు గ్రామాల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. మూడు గంటలలోనే గ్రామ సభలు పూర్తి చేశారు. ముఖ్యంగా గ్రామాలలోని సమస్యలు, రైతుల సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు ఏర్పాటు చేశారు. అయితే గ్రామ సభల నిర్వహణపై ఎలాంటి ప్రచారం లేక పోవడంతో ప్రజలు శ్రద్ధ కనబరచలేదు. కార్యక్రమాలలో అన్ని శాఖల అధికారులు పాల్గొని అక్కడ ప్రజలు, రైతుల నుంచి వచ్చే వినతులు స్వీకరించి అక్కడికక్కడే పరిష్కరించాలి. గత ఐదు సంవత్సరాలలో అధికారులు గ్రామ సభలపై పది రోజులకు ముందే పత్రికా ప్రకటనలు నిర్వహించడం, ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొని ముఖ్యంగా గ్రామ సభలలో వచ్చిన భూ సమస్యలతో పాటు ఇతర సమస్యలను వీలైనంతవరకు అక్కడే పరిష్కరించేందుకు కృషి చేశారు. కానీ ప్రజల నుంచి స్పందన లేకపోవడంతో సభలను తూతూ మంత్రంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విల్సన్, ఎస్ఓ శైలజారాణి, ఈఓపీఆర్డీ శ్రీనివాసరెడ్డి, మార్కెటింగ్ ఏడీ రాజాబాబు, సెక్రటరీలు సాంబశివరావు, శ్రీనివాసరావు, నారాయణ పాల్గొన్నారు.

రేవేంద్రపాడులో గ్రామ సభ

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం రేవేంద్రపాడులో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభకు పలుకూరి మేరమ్మ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ మాట్లాడుతూ మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథకంలో తీసుకు వెళ్తారని అన్నారు. గ్రామ స్వరాజ్యం తీసుకువచ్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వర్ణ గ్రామపంచాయతీ పేరుతో గ్రామ అభివృద్ధికి బాటలు వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో డీపీఓ కుసుమ శ్రీదేవి, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు కేశంనేని శ్రీఅనిత, నాయకులు వాసిరెడ్డి శ్రీనివాసరావు, పలుకూరి శామ్యూల్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

ఫిరంగిపురం: గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని తహసీల్దార్ రాజారమేష్ మోహన్ అన్నారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో జాతీయ ఉపాధి హామీ శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. సభలో ప్రజలు అందజేసిన అర్జీలను చదివి వినిపించారు. కోనేరు వద్ద బావికి వెళ్లే దారి బాగోలేదని సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేయాలని, వీధులలో ప్రతిరోజు చెత్తను తొలగించాలంటూ, డ్రైనేజీలు శుభ్రం చేయించాలని, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలంటూ అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి మేడాబాబు, పంచాయతీ కార్యదర్శి విష్ణువర్ధన్‌రావు పాల్గొన్నారు. పొనుగుపాడులో.. గ్రామంలో ఉపాధి హామీ గ్రామసభ నిర్వహించారు. ప్రజలు తమ సమస్యలు అధికారులకు తెలిపారు. నుదురుపాడు సచివాలయం వద్ద గ్రామసభ నిర్వహించారు. తూర్పు బజారు వాగుపై బ్రిడ్జినిర్మించాలని, డ్రైనేజ్ సరిగా లేదని దానిని సరిచేయలని కోరుతూ వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి జి.నాగమల్లేశ్వరి, కార్యదర్శి వెంకటేశ్వర్లు, జి.చౌడయ్య, కె.శివారెడ్డి పాల్గొన్నారు.

అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

మేడికొండూరు: అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు ఉంటాయని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని మేడికొండూరులో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. వార్డు మెంబర్లు గ్రామ సభకు గైర్హాజరవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు పద్మనాభుడు, మండల అభివృద్ధి అధికారి ప్రభాకరరావు, ఏపీఓ కిరణ్మయి, సర్పంచ్ పి.నాగమణి పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌ను పరిశీలించిన కలెక్టర్

తాళ్లాయపాలెం(తాడికొండ): తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం ఇసుక రీచ్‌ను శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పరిశీలించారు. తొలుత సీడ్ యాక్సిస్ రోడ్డుపై ఇసుక కోసం వచ్చిన వాహనాలను పరిశీలించిన ఆమె రోడ్డుపై అనవసరంగా వాహనాలు పార్క్ చేయకుండా నియంత్రణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం తాళ్లాయపాలెం ఇసుక రీచ్‌ను సందర్శించి ఇసుక రవాణా కోసం యార్డుకు వచ్చిన వాహనదారులతో కలెక్టర్ మాట్లాడారు.

తుళ్లూరు, తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయం, గుంటూరు ఆర్డీఓ కార్యాలయాల్లో ఇసుక బుకింగ్ చేసుకునేందుకు ఏర్పాటు చేయడం జరిగిందని వెల్లడించారు. బుకింగ్ చేసుకున్న వాహనాలకు కేటాయించిన స్లాట్ ప్రకారం స్టాక్ యార్డుల వద్ద అనుమతించడం జరుగుతుందని తెలిపారు. ఇసుకను బుకింగ్ చేసుకునే సందర్భంలో అవసరమైన ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, వాహన లైసెన్స్ అందించాల్సి ఉంటుందని చెప్పారు. సెప్టెంబర్ 11వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుని ఆ మేరకు స్లాట్ టైమింగ్ ప్రకారం స్టాక్ యార్డుకు వాహనాన్ని తీసుకెళ్లి ఇసుకను ట్రాన్స్‌పోర్ట్ చేసుకోవచ్చని చెప్పారు. కలెక్టర్ వెంట సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, ఇన్‌చార్జి ఆర్డీఓ గంగరాజు, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథరావు, మైన్స్ డీడీ చంద్రశేఖర్, తుళ్లూరు తహసీల్దార్ సుజాత పాల్గొన్నారు.



తాళ్లాయపాలెం ఇసుక రీచ్‌ను పరిశీలించి డ్రైవర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

ఘనంగా ఆంధ్రకేసరి జయంతి వేడుకలు

మంగళగిరి: పట్టణంలోని ఏపీఎస్పీ 6వ బెటాలియన్‌లో ప్రకాశం పంతులు జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి బెటాలియన్ కమాండెంట్ నగేష్ కుమార్, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ఆయన చేసిన పోరాటాన్ని గుర్తు చేసుకున్నారు.



ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బెటాలియన్ కమాండెంట్ నగేష్

రామచంద్రపురంలో..

తాడేపల్లిరూరల్: ఆంధ్రకేసరి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఎంటీఎంసీ పరిధిలోని రామచంద్రాపురంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు భీమిరెడ్డి అంజిరెడ్డి మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు ఆంధ్రరాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రిగా సేవలను అందించారని, మద్రాసులో సైమన్ కమిషనర్ వ్యతిరేక ప్రదర్శనలో తుపాకికి ఎదురుగాగుండె నిలిపి ఆంధ్రకేసరి అని పేరు పొందారని అన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ఆరోగ్య కేంద్ర వైద్యులు చంద్ర ప్రియాంక, వైద్యశాల సిబ్బంది, పశువైద్యశాల జూనియర్ డాక్టర్ లక్ష్మి పాల్గొన్నారు.



టంగుటూరి చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అంజిరెడ్డి తదితరులు

టంగుటూరి సేవలు ఎనలేనివి

ఫిరంగిపురం: టంగుటూరి ప్రకాశం పంతులు ఎనలేని సేవలు అందించారని పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణమూర్తి అన్నారు. మండలంలోని వేమవరం గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రకాశం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రజలకు ఆయన చేసిన సేవలు వివరించారు. నిరుపేదరికం నుంచి వచ్చిన టంగుటూరి ఉన్నత స్థాయికి చేరాడని ప్రతి విద్యార్థి ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ జె.సుబ్బయ్య, హెచ్ఎం కమల్‌మోహన్, గ్రామ విద్యాసెక్రటరీ ప్రభాకర్, ఉపాధ్యాయుడు ప్రభాకర్ పాల్గొన్నారు.

వ్యాక్సిన్ వివరాలు నమోదు తప్పనిసరి

ఫిరంగిపురం: గర్భిణులు, చిన్నారులకు వేసే వ్యాక్సిన్ వివరాలు తప్పనిసరిగా యూ విన్ పోర్టల్‌లో ఆరోగ్య సిబ్బంది నమోదు చేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి కె.సుబ్బరాజు అన్నారు. మండలంలోని నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వ్యాక్సిన్ రూం, మందులు గదిని శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా బీసీజీ వ్యాక్సిన్‌ను ఆరోగ్య సిబ్బంది వేస్తున్నట్లు తెలిపారు. షుగర్, ఆస్మా సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారు కూడా తప్పనిసరిగా ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలని కోరారు. దీనిద్వారా క్షయవ్యాధికి దూరంగా ఉండవచ్చని చెప్పారు. వ్యాక్సిన్ వేసే ప్రతి ఆరోగ్యసిబ్బంది వ్యాక్సిన్ వివరాలు యూవిన్ పోర్టల్‌లో నమోదు చేసినట్లయితే పూర్తి వివరాలతో కూడిన డిజిటల్ సర్టిఫికెట్లు అందజేస్తారన్నారు. ఆయన వెంట శాస్త్రి, వైద్యురాలు యానిగ్రేస్ పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి కె.సుబ్బరాజు

జీఓ నంబర్ 85ను రద్దు చేయాలని వినతి

తాడేపల్లిరూరల్: జీఓ నంబర్.85ను రద్దు చేయాలని కోరుతూ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆంధ్రప్రదేశ్ పీహెచ్‌సీ డాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లిలోని ఆయన కార్యాలయంలో సమస్యలను వివరించారు. ఆ జీఓ కారణంగా 50 శాతం కోటాను 15 శాతం క్లినికల్, 30 శాతం నాన్ క్లినికల్‌గా మార్చారని, అదే విధంగా బాండ్ రూ.25 లక్షల నుంచి రూ.50 లక్షలకు పెంచారని, ఈ కారణంగా సర్వీస్ చేస్తున్న డాక్టర్లు పీజీ సీటు పొందే అవకాశాలు ఉండవని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రానున్న రోజుల్లో సర్వీసులో చేరే వైద్యుల సంఖ్య గణనీయంగా తగ్గుతుందని వినతిపత్రంలో పేర్కొన్నారు.



మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న డాక్టర్స్ అసోసియేషన్ సభ్యురాలు

డాక్టర్ అఖిలేష్ గుప్తాకు కేఎల్‌యూ విజనరీ అవార్డు



తాడేపల్లిరూరల్: యూజీసీ మాజీ కార్యదర్శి, సెర్బ్ సలహాదారు డాక్టర్ అఖిలేష్‌గుప్తాకు తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీ విజనరీ అవార్డును ఈనెల 29వ తేదీన అందజేయనున్నారని వర్సిటీ ప్రో చాన్సలర్ డాక్టర్ కేఎస్ జగన్నాథరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా సైన్స్ పరంగా, సామాజికంగా, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సేవలకు గాను అఖిలేష్‌కు 2024వ విజనరీ అవార్డును అందజేయనున్నట్లు పేర్కొన్నారు. గత 40 ఏళ్లుగా సైన్స్‌ను అభివృద్ధి చేయానికి ఎంతగానో కృషి చేసిందుకు తాము డాక్టర్ అఖిలేష్ గుప్తాకు ఈ విజనరీ అవార్డును అందజేయన్నుట్లు వారు ఆ ప్రకటనలో తెలిపారు.

అంబేడ్కర్ భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలి

నెహ్రూ నగర్: గుంటూరు ఏసీ కళాశాల ఎదురు ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన నిర్మాణ పనులను ప్రారంభించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి భవన నిర్మాణానికి తగిన చొరవ చూపాలని దళిత సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు కలసి వినతి పత్రం అందజేశారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే పేద విద్యార్థులకు శిక్షణ ఇచ్చే విధంగా ఆలోచన చేయాలని కోరారు. కోడిగుడ్డు సత్రం హాస్టల్ పనులు పూర్తి చేసి గురుకుల పాఠశాలగా మార్చి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని విన్నవించారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న గుంటూరు నగరంలోని దళిత క్రైస్తవుల శ్మశాన వాటికను సమస్యను పరిష్కరించి దళిత క్రైస్తవులకు న్యాయం చేయాలని విన్నవించారు. స్వర్ణ భారతి నగర్ వద్ద క్రిస్టియన్ భవన్ పనులు పూర్తి చేసి భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ల ప్రకాష్, సాదు మాల్యాద్రి పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ అధికారుల ఆకస్మిక తనిఖీలు

మేడికొండూరు: మండల పరిధిలోని మేడికొండూరులో ఎరువులు, పురుగు మందుల షాపులను వ్యవసాయ శాఖ విజిలెన్స్ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. మేడికొండూరులోని వాసవి లక్ష్మి బాలాజీ పెస్టిసైడ్స్ షాపుల్లో కాలం చెల్లిన రూ.69,063 విలువ చేసే 53.735 లీటర్ల పురుగు మందులు స్వాధీనం చేసుకున్నారు. జయలక్ష్మి జనరల్ స్టోర్స్‌లో తనిఖీలు చేపట్టగా, ప్రిన్సిపల్ సర్టిఫికెట్ లేకుండా 50.8 లీటర్ల పెస్టిసైడ్స్ విక్రయిస్తున్నందున రూ.1.89 లక్షల విలువ చేసే పెస్టిసైడ్స్ విక్రయాలు నిలుపుదల చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవసాయ శాఖ అధికారి కె.రమణకుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రయ్య, మేడికొండూరు ఏఓ ఎం.నాగరాజు పాల్గొన్నారు.



తనిఖీల్లో పట్టుపడ్డ కాలం చెల్లిన మందుల

సామూహిక వరలక్ష్మీ వ్రతం



వేమవరం మహంకాళీ ఆలయంలో వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు

ఫిరంగిపురం: మండలంలోని పలు ఆలయాల్లో శ్రావణ శుక్రవారం పూజలు నిర్వహించారు. వేమవరంలోని కోటిలింగాల క్షేత్రంలోని మహంకాళీ ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రత కార్యక్రమం అర్చకుడు ఆదర్స్ ఆచార్యులు నిర్వహించారు. ఈ పూజల్లో పలువురు మహిళలు పాల్గొని కుంకుమార్చనలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఫిరంగిపురంలోని విజయదుర్గా అమ్మవారికి అర్చకులు రాజేంద్రశర్మ విశేష పూజలు చేశారు. వాసవీ కన్యకాపరమేశ్వరికి అర్చకులు కుంకుమార్చనలు నిర్వహించారు. గీతా భజన మండలి ఆధ్వర్యంలో లలితా సహస్రనామ పారాయణ కావించారు. నుదురుపాడులోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరుడికి అర్చకులు పూర్ణానంద శాస్త్రి అర్చనలు చేశారు.

పోలేరమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు

మంగళగిరి: పట్టణంలోని పాత మంగళగిరిలోని పోలేరమ్మ అమ్మవారికి పాత మంగళగిరి పద్మశాలీయ బహుత్తమ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 25వ తేదీన శ్రావణ మాసం ఆదివారం సందర్భగా పోలేరమ్మ అమ్మ వారికి బోనాల పండుగలో భక్తులు పెద్ద ఎత్తున్న పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు పాల శ్రీనివాస్, కాంద్రు అమరలింగేశ్వరావు, మునగాల రామారావు, వూట్ల పాణి పాల్గొన్నారు.



అమ్మవారికి మొక్కుతున్న భక్తులు

జీజీహెచ్‌లో మూడు సీటీ స్కాన్లు

సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో మూడు సీటీ స్కాన్ మిషన్‌లు ఉండటం శుభ పరిణామమని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. పాదిల ప్రసాద్ ప్రాంగణంలో సీటీ స్కాన్ మిషన్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రూ.42 లక్షలతో సీటీ స్కాన్ మిషన్‌కు మరమ్మతులు చేయడం జరిగిందన్నారు. మూడేళ్ళ నుంచి సీటీ స్కాన్‌మిషన్ అందుబాటులో లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడ్డారన్నారు. రూ.4 కోట్లతో నూతన సీటీ స్కాన్‌ను అందుబాటులోకి ప్రభుత్వం తీసుకుని వచ్చిందని వెల్లడించారు. మరమ్మతులకు గురైన సీటీ స్కాన్ మిషన్‌కు నిధులు కేటాయించి వెంటనే మరమ్మతులు చేయాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరామన్నారు. అందులో భాగంగా ఈ పరికరాన్ని రోగులకు అందుబాటులో ఉంచామన్నారు. నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో ఉన్న సీటీ స్కాన్ ద్వారా పలువురు రోగులకు పరీక్షలు చేయించామని తెలిపారు. ఆస్పత్రి ప్రాంగణంలో మూడు సీటీ స్కాన్ మిషన్‌లు ఉండటం వల్ల రోగులకు చాలా మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ జానీ పాల్గొన్నారు.



సీటీ స్కాన్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

ఆకతాయిల కదలికలపై నిఘా: జిల్లా ఎస్పీ

నగరంపాలెం: బదిలీపై జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్ల(పీఎస్)కు వెళ్తున్న ప్రతి ఒక్కరూ నిబ్ధతతో విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ కోరారు. పీఎస్‌లల్లో ఐదేళ్లు పూర్తి చేసుకున్న ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్ల(హెచ్‌సీ)ను బదిలీలు చేపట్టారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయ(డీపీఓ) ఆవరణలోని హాల్‌లో వారితో సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పీఎస్‌ల పరిధిలోని ఆకతాయిల కదలికలపై నిఘా ఉంచాలని అన్నారు. గంజాయి, మత్తు పదార్థాల సమాచారం ఉన్నట్లైతే, సంబంధిత పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తేవాలని చెప్పారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు. పీఎస్‌లకు వచ్చే ఫిర్యాదిదారులతో మర్యాదగా మెలగాలని అన్నారు. బాధితుల అర్జీలను కూలంకుషంగా పరిశీలించి, సంబంధిత పోలీస్ అధికారులతో న్యాయం జరిగేలా చూడనన్నారు. పీఎస్‌ల్లోని ప్రతి ఒక్కరూ సంతోషంగా విధులు నిర్వర్తించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీ (పరిపాలన) జీవీ.రమణమూర్తి, ఎస్‌బీ సీఐ ఆనంద్, కార్యాలయ ఏఓ వెంకటేశ్వరరావు, జిల్లా ఎస్పీ సిసి ఆదిశేషు, ఏఆర్ పరిపాలన ఆర్ఐ బ్రహ్మానందం పాల్గొన్నారు.